# సాక్షి బాపట్ల

గురువారం । 11 । సెప్టెంబర్ । 2025






## ఉద్యాన శాఖ సిబ్బందికి శిక్షణ

దుగ్గిరాల: దుగ్గిరాల వ్యవసాయ కార్యాలయంలో ఉద్యాన శాఖ సిబ్బందికి ఏఓ ఆర్. విజయబాబు ఆధ్వర్యంలో బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.



## పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 41,086 క్యూసెక్కులు వదులుతున్నారు.



## ఆర్‌ఓబీ పనుల పరిశీలన

నెహ్రూనగర్: శంకర్‌విలాస్ ఆర్‌ఓబీ పనులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు చేయాలని సూచించారు.

## న్యూస్‌రీల్

### నేడు బాపట్లకు ఉప ముఖ్యమంత్రి రాక

**బాపట్ల:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ లాంచింగ్ ఆఫ్ గ్రేట్ గ్రీన్ వాల్, నేషనల్ ఫారెస్ట్ మార్టిర్స్ డే సందర్భంగా గురువారం బాపట్లలో పర్యటించనున్నారు. ఉప ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, శాసనసభ్యులు అధికారులు పాల్గొంటారు.

**బందోబస్తు పరిశీలన..**

**బాపట్లటౌన్:** ఈనెల 11న సూర్యలంక సమీపంలోని నగరవనంలో జరిగే అమరవీరుల స్మారకస్థూపం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వస్తున్న నేపథ్యంలో పోలీస్ అధికారులకు, సిబ్బందికి బుధవారం నగరవనంలో జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ బ్రీఫింగ్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అన్ని ప్రదేశాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హెలిప్యాడ్, కాన్వాయ్, రోప్ పార్టీలు, చెకింగ్ పాయింట్లు, ట్రాఫిక్ మళ్లింపు ప్రదేశాలు వంటివాటిపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, చీరాల డీఎస్పీ ఎం.డి.మోయిన్, ఎస్‌బీ సీఐ జి.నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

### బస్టాండ్‌లను ఆధునీకరిస్తాం

**ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు**



**అద్దంకి రూరల్:** బస్టాండ్‌ల ఆధునికీకరణ చేపట్టనున్నట్లు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. బుధవారం అద్దంకి డిపోను ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని డిపోలను సందర్శించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన స్త్రీశక్తి పథకం అమలు తీరు పరిశీలించినట్లు తెలిపారు. అద్దంకిలోని పాత బస్ స్టేషన్, కొత్త బస్‌షెల్టర్‌కు కలిపి ఒక పెద్ద బస్‌స్టాండ్‌గా తయారు చేయనున్నట్లు తెలిపారు. స్త్రీశక్తి పథకం అమలుతో ఆక్యుపెన్సీ పెరిగిందన్నారు. ఆర్టీసీ సిబ్బందికి ట్రైనింగ్ ఇచ్చామన్నారు. డిపోలో పనిచేసే మెకానికల్ స్టాఫ్‌ను అభినందించారు. కార్యక్రమంలో నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, ఈడీ (ఆపరేషన్స్) అప్పలరాజు, నెల్లూరు జోన్ ఈడీ నాగేంద్ర ప్రసాద్, బాపట్ల జిల్లా డీపీటీఓ సామ్రాజ్యం, డిపో మేనేజర్ బి.రామ్మోహన రావు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

### జిల్లా సమాచార శాఖ ఏడీగా పి.వెంకటరమణ



**బాపట్ల:** అనంతపురం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖలో డీపీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న పి.వెంకటరమణకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి బాపట్ల జిల్లాకు నియమించారు. ఈమేరకు సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా ఉత్తర్వులు జారీచేశారు. బుధవారం ఉదయం బాపట్ల జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పి.వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెంకట మురళిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

### నేటి నుంచి స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపికలు

**డీఈఓ చంద్రకళ**

**నరసరావుపేట ఈస్ట్:** పాఠశాల విద్యాశాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11నుంచి 19వరకు వివిధ క్రీడాంశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు డీఈఓ ఎల్.చంద్రకళ, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్.సురేష్‌కుమార్, మహిళా కార్యదర్శి వి.పద్మావతి బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఎంపికలు స్పెల్- 1లో భాగంగా అండర్-14, అండర్-17 బాలురు, బాలికల విభాగంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. పోటీల్లో భాగంగా ఈనెల 11న నందిగామ జెడ్పీ హైస్కూలులో సెపక్‌తక్రా, 12న డీఎస్‌ఏ స్టేడియంలో కరాటే, 15న చిలకలూరిపేట ఏఎంజీ పాఠశాలలో జూడో, గట్కా, 16న డీఎస్‌ఏ స్టేడియంలో ఫుట్‌బాల్, 17న అచ్చంపేట గురుకుల పాఠశాలలో రగ్బీ, 18న ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో ఈత, 19న ఏఎంజీ పాఠశాలలో బాక్సింగ్, అచ్చంపేటలో రెజ్లింగ్ (కుస్తీ) పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు.

## ఎమర్జెన్సీని మించిన అరాచకం



ప్రజల పక్షాన స్వేచ్ఛగా వ్యవహరించే పత్రికలపై దాడులు పెరిగాయి. 'సాక్షి' ఎడిటర్ ధనంజయ్‌రెడ్డిపై కేసులు పెట్టడం దారుణం. పత్రికా వ్యవస్థను అవహేళన చేసేవిధంగా ఈ కేసులు ఉన్నాయి. ఇళ్లల్లోకి వచ్చి మరీ దాడులు చేస్తున్నారు. తప్పులను, నేరాలను ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారు. రాజీకి రాని బాధితులపై కౌంటర్ కేసులు పెడుతున్నారు. ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెన్సీని చూడని వారికి, సంజయ్ గాంధీ మైండ్ సెట్ తెలియని వారికి, కూటమి ప్రభుత్వంలో ఆ లోటు తీరిపోయింది. నాటి ఎమర్జెన్సీలో ఇందిరాగాంధీని వ్యతిరేకించిన వారిని మాత్రమే ఇబ్బందులు పెట్టారు. నేడు నారా వారి కుటుంబ పాలనలో అంతటా అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోంది. దోపిడీని ప్రశ్నిస్తున్న మీడియా గొంతు నొక్కుతోంది. దీన్ని అందరూ వ్యతిరేకించాలి.

– పోటికలపూడి జయరాం,
రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి




## పత్రికా స్వేచ్ఛను హరించడం అప్రజాస్వామికం



నాణేనికి రెండోవైపు ప్రజల పక్షాన నిలుస్తూ, వాస్తవాలను ప్రచురిస్తూ, ప్రజలకు– ప్రభుత్వానికి వారధిగా ఉండే ఏ పత్రికా జర్నలిస్ట్ స్వేచ్ఛనైనా హరించడం అప్రజాస్వామికం. ఏమైనా అభ్యంతరాలు ఉంటే పత్రికాముఖంగా ఖండించాలనేగానీ ఈ విధంగా కేసులు పెట్టడం ఎంతమాత్రం సమంజసం కాదు. సాక్షి లేదా మరేదైనా పత్రిక ఇచ్చిన వార్తా కథనాలతో ప్రభుత్వం విభేదిస్తే తప్పకుండా ఖండించవచ్చు. తమ కోణంలో చెప్పినా కానీ స్పందించలేని పక్షంలో ఆ సంస్థపై నోటీసులు ఇచ్చి చట్ట రీత్యా చర్యలు తీసుకోవచ్చు. కానీ నేరుగా కేసులు నమోదు చేయడం సరికాదు. పాత్రికేయులపై, మీడియా సంస్థలపై జరుగుతున్న దాడులు, అన్యాయంగా జరుగుతున్న అరెస్టులపై అందరూ స్పందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

– కారుమంచి రామారావు,
ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్స్ స్టేట్ జనరల్ సెక్రటరీ

# కొంటాం అంటూనే.. కొర్రీ!

- నాణ్యత సాకుతో పొగాకు తిరస్కారం
- ఏ గ్రేడుకూ కొనేది లేదంటే ఏం చేయాలి?
- పొగాకును వదిలేసుకోవటం మినహా చేసేదేం లేదు
- వాపోతున్న రైతులు

**బాపట్ల జిల్లా రైతుల నిర్వేదం**



తెనాలి కొనుగోలు కేంద్రంలో బాపట్ల జిల్లా పొగాకు రైతులు

**తెనాలి:** ఆరుగాలం కష్టించి పండించిన పొగాకును అమ్ముకోవటానికి రైతులు అవస్థలు పడుతున్నారు. కొనుగోళ్ల కోసం నెలల తరబడి ఎదురుచూసి, తీరా కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాక నాణ్యత లేదని తిరస్కరించటంతో దిక్కుతోచటం లేదంటున్నారు. పొగాకును వదిలేసి వెళ్లటం మినహా మరో మార్గం లేదని, ప్రభుత్వమే తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. వివరాలిలా ఉన్నాయి..

**కొనుగోళ్ల కొంతే..**

రాష్ట్రంలోని రైతులు పండించిన పొగాకు పంటకు గిట్టుబాటు ధర లేకపోవటంతో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చింది. మార్క్‌ఫెడ్ బయ్యర్లను ఏర్పాటుచేసి పొగాకు కొనుగోళ్లను చేయిస్తోంది. ఈ క్రమంలో పొగాకు పండే ప్రాంతాల్లో గొడౌన్లు ఖాళీలేకపోవటంతో తెనాలిలోని రాష్ట్ర ప్రభుత్వ వేర్‌హౌసింగ్ గిడ్డంగిలో ఈనెల ఒకటో తేదీ నుంచి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆరంభించింది. గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో పొగాకు రైతులకు షెడ్యూళ్లనిచ్చి, విడతలవారీగా ఏయే కొనుగోలు కేంద్రానికి ఎప్పుడు పొగాకు తీసుకెళ్లాలనేది మెసేజ్‌లను పంపుతున్నారు. ఆ ప్రకారం సమాచారం అందుకున్న బాపట్ల జిల్లా కారంచేడు, చీరాల ప్రాంత రైతులు పలువురు మంగళవారం రాత్రికి తమ పొగాకు బేళ్లతో సహా తెనాలిలోని కొనుగోలు కేంద్రానికి చేరుకున్నారు. బుధవారం ఉదయాన్నే బయ్యర్లు వచ్చి కొంత సరుకును మాత్రమే తీసుకుని మిగిలినది తిరస్కరించారు.

**ఎంతోకొంతకు తీసుకోమన్నా..**

పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం మూడు గ్రేడ్లను నిర్ణయించింది. కిలో రూ.12, రూ.9, 6 చొప్పున నాణ్యత ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ కొందరు రైతులకు చెందిన పొగాకును కనిష్టమైన రూ.6లకు కూడా తీసుకోకుండా నిర్దాక్షిణ్యంగా తిరస్కరించారని రైతులు చెప్పారు. పొగాకును ఇక్కడకు తరలించటానికే బోలెడు ఖర్చయిందనీ, మళ్లీ ఇప్పుడు దీనిని ఎక్కడికి తీసుకెళ్లాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. బయ్యర్లు నాణ్యత తనిఖీకని బేళ్లను విడదీశారనీ, ఇప్పుడా పొగాకు దేనికీ పనికిరాదని వాపోతున్నారు. కనిష్ట ధరకు కాకపోయినా ఎంతో కొంతకు తీసుకోమని ప్రాధేయపడుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదంటున్నారు.



కొనుగోలు కేంద్రంలో పొగాకు బేళ్లు

### 24 బేళ్లను తిరస్కరించారు



పొగాకు అమ్ముకోవటానికి రెండు నెలలుగా ఎదురుచూస్తుంటే షెడ్యూలు ఇచ్చారు. ఇప్పటికి తెనాలిలోని కొనుగోలు కేంద్రానికి తీసుకురమ్మని సమాచారమిచ్చారు. బయ్యర్లొచ్చి అన్నింటినీ ఏ గ్రేడుకూ పనికిరావంటూ సీఆర్ (కంపెనీ రిజెక్ట్) రాశారు. నేను తెచ్చిన 24 బేళ్లనూ తిరస్కరించారు. ఇప్పుడు నేనేం చేయాలి. కనిష్ట ధర కాకున్నా ఎంతోకొంత ఇమ్మన్నా పట్టించుకోవటం లేదు.

– కమలాకరరావు, జిరుబులవారిపాలెం, కారంచేడు మండలం, బాపట్ల జిల్లా

### కొనమంటూ తేల్చి చెబుతున్నారు..



ప్రభుత్వం కొనుగోలుకు మూడు గ్రేడ్లు నిర్ణయించింది. ఏదొక గ్రేడుకు కొంటారన్న ఆశ కలిగింది. తీరా ఇక్కడికొస్తే ఏ గ్రేడుకూ తీసుకోమని బయ్యర్లు తేల్చారు. గ్రేడ్లు పెట్టకున్నా ప్రైవేటు వాళ్లకు ఎంతకో కొంతకు తెగనమ్ముకునేవాళ్లం. ఇప్పుడేం చేయాలి. బేళ్లను విప్పదీసి చూసినందున ఇప్పుడు అవి ఎందుకూ పనికిరావు. మేమేం చేసుకోవాలి? ప్రభుత్వమే మాకు న్యాయం చేయాలి.

– యర్రం లక్ష్మారెడ్డి, యర్రంవారిపాలెం, బాపట్ల జిల్లా

## పోలీసులు ప్రతిష్ట దిగజార్చుకుంటున్నారు



రహదారిపై ఆందోళన చేస్తున్న చీరాల న్యాయవాదులు

- న్యాయవాదులపై నమోదు చేస్తున్న తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలి
- చీరాలలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు
- చీరాల – వాడరేవు రహదారిపై ఆందోళన

**చీరాల రూరల్:** సామాన్యులపై, న్యాయవాదులపై పోలీసులు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ.. వారి ప్రతిష్టను వారే దిగజార్చుకుంటున్నారని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. చీరాలకు చెందిన న్యాయవాది ఆకుల కొండయ్యపై జె. పంగులూరు పోలీసులు పెట్టిన అక్రమ కేసుకు నిరసనగా బుధవారం న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి కోర్టు ఎదుటనున్న చీరాల–వాడరేవు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌరవ రమేష్‌బాబు, మేరుగ రవికుమార్, సీనియర్ న్యాయవాది బండారుపల్లి హేమంత్ కుమార్ మాట్లాడారు. చీరాల కోర్టులో ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాది కొండయ్యపై టీడీపీ నాయకుడు గుంటూరు మాధవరావు జె.పంగులూరు పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు ఎటువంటి విచారణ చేయకుండా న్యాయవాదిపై కేసు నమోదు చేశారని చెప్పారు. న్యాయవాది కొండయ్యపై మాధవరావు ఫిర్యాదు చేసిన రోజున కొండయ్య చీరాలలోనే ఉన్నాడని సీసీ ఫుటేజీలో కూడా ఉందన్నారు. అయినప్పటికీ పోలీసులు ఎటువంటి విచారణ చేపట్టకుండా తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. తక్షణమే పోలీసు ఉన్నతాధికారులు స్పందించి న్యాయవాదిపై నమోదు చేసిన తప్పుడు కేసును తీసివేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో న్యాయవాదుల పట్ల పోలీసులు ప్రదర్శిస్తున్న తీరు సక్రమంగా లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కక్షిదారుల తరఫున పోలీసు స్టేషన్‌కు వెళుతూ న్యాయసహాయం అందిస్తున్న న్యాయవాదులపై పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని న్యాయవాదులు వాపోయారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బండ్లమూడి విజయకుమార్, సీనియర్ న్యాయవాదులు కాకాని వెంకట్రావు, టీజే సాయిబాబు, పీఎస్ఎల్‌వీ ప్రసాద్, ఆకిశెట్టి పుల్లయ్యనాయుడు, సజ్జా శ్రీనివాసరావు, రాజు వెంకటేశ్వర్‌రెడ్డి, భానుప్రకాష్, గొడుగుల గంగరాజు, చల్లా సురేష్, కొటిక ఉదయభాస్కరరావు, నాశన రాము, షేక్ సిరాజ్, మహిళా న్యాయవాదులు స్నేహ, ఈశ్వరిరెడ్డి, పద్మ పాల్గొన్నారు.

# కన్నతండ్రే కర్కోటకుడు

- ఇద్దరు బిడ్డలను రైల్వేస్టేషన్‌లో వదిలేసి వెళ్లిన తండ్రి
- మద్యానికి బానిసై రోజుల బిడ్డను అమ్మేసిన వైనం
- భార్యను హింసిస్తూ సంతానాన్ని వదిలించుకునే ప్రయత్నం



రైల్వే స్టేషన్‌లో తండ్రి వదిలి వెళ్లిన తన బిడ్డలను అక్కున చేర్చుకున్న తల్లి

**చినగంజాం:** కట్టుకున్న భార్యను పిల్లలు కనే యంత్రంలా మార్చి ఆరుగురు పిల్లలను కని కుటుంబాన్ని పోషించే సత్తా లేక మద్యానికి బానిసై భార్యను తీవ్రమైన హింసకు గురి చేస్తూ కన్న బిడ్డలను సైతం అమ్మేసుకొని, తన వద్ద ఉన్న బిడ్డలను వదిలించుకొని పరారయ్యాడు ఒక ప్రబుద్ధుడు. దీనికి సంబంధించి అతని భార్య చిన్నారి తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం మండలం చింతపల్లికి చెందిన పంగి రాజు, చిన్నారిలకు సుమారు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. కూలి పనులు చేసుకొని జీవించే వారికి మొదటి సంతానం మగ పిల్లవాడు సాయి కలుగగా ప్రసవ సమయంలో వైద్యులను సంప్రదించకుండా ఆమెకు భర్త రాజు తనే స్వయంగా బొడ్డు కోసి ప్రసవం చేశాడు. అటు తరువాత చినగంజాం మండలంలో రొయ్యల చెరువుల్లో కూలి పనుల కోసం శంకర్ అనే మధ్యవర్తి ద్వారా ఇక్కడికి వచ్చారు. మండలంలోని పెదగంజాం ప్రాంతంలోను, కొత్తపట్నం మండలం ఈతముక్కల వద్ద రొయ్యల చెరువుల దగ్గర పనిచేస్తూ 12 ఏళ్లుగా జీవనం కొనసాగిస్తున్నారు. ఈ మధ్య కాలంలో వారికి మొదటి బిడ్డ సాయి తరువాత రెండో సంతానం ప్రవీణ్, మూడో సంతానంగా ఇంకా పేరు పెట్టని మరో ఆడ బిడ్డ, నాలుగో సంతానంగా మగపిల్లవాడు లడ్డు, ఐదో సంతానంగా ఆడపిల్ల లల్లి జన్మించారు. వీరిలో మొదటి బిడ్డ సాయిని చినగంజాం మండలంలోని గొల్లపాలెం వద్ద పనిలో కుదుర్చగా, రెండో వాడు ప్రవీణ్‌ను అడవీధిపాలెంలో పనికి కుదిర్చాడు. మూడో సంతానం ఆడపిల్లని నడిచే వయస్సులో ఈతముక్కల వద్ద వేరొకరికి అమ్మేశాడు. ఇదేమని ప్రశ్నించి అడ్డుకోబోయిన భార్య చిన్నారిని గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. భర్త పెట్టే బాధలను భరిస్తూ అతని వద్దే ఉంటూ సంతానం కనిపెట్టే యంత్రంలా తయారైంది. ప్రస్తుతం చినగంజాం మండలంలోని పెదగంజాం చెరువులు వద్ద కూలి పని చేసుకుంటూ భార్యాభర్తలు, ఇద్దరు సంతానం జీవిస్తున్నారు. వారికి ఇటీవల మరో ఆడపిల్ల జన్మించింది. మద్యానికి బానిసై కుటుంబాన్ని పోషించే పరిస్థితి లేదని రాజు గ్రహించి 24 రోజుల పసిగుడ్డును రూ.30 వేలు నగదు తీసుకొని తల్లికి తెలియకుండా అమ్మేశాడు. ఆరుగురు సంతానానికి ఆస్పత్రి వెళ్లకుండా తనే స్వయంగా ప్రసవం చేయడం గమనార్హం.

**ఇద్దరు చిన్నారులను రైల్వేస్టేషన్‌లో వదిలి వెళ్లి..**

తన సంతానంలో తన దగ్గర మిగిలి ఉన్న ఇద్దరు చిన్నారులను వారం రోజుల క్రితం తను నివాసముంటున్న చెరువుల దగ్గర ఇంటి నుంచి బయటకు తీసుకొచ్చాడు. భార్య అడ్డగిస్తుందేమోనని నిద్రిస్తున్న భార్యను మంచానికి కట్టేసి తన ఇద్దరు పిల్లలను తీసుకొని బయటకు వచ్చేశాడు. మంగళవారం ఉదయం పిల్లలు లల్లి, లడ్డులను చినగంజాం రైల్వేస్టేషన్‌లో వదిలివేసి ఎటో పరారై వెళ్లిపోయాడు. రైలు పట్టాలను దాటుతూ రైల్వే ప్లాట్‌ఫాం ఎక్కే ప్రయత్నం చేస్తూ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న చిన్నారులను రైల్వే కీమాన్ గుర్తించి స్థానికంగా నివాసముండే మల్లీశ్వరి అనే మహిళకు అప్పగించి వెళ్లిపోయాడు. సదరు మహిళ స్థానికుల సాయంతో ఆ ఇద్దరు చిన్నారులకు స్నానం చేయించి, మంచి దుస్తులు ఇచ్చి భోజనం పెట్టి అటు తరువాత స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇచ్చింది. విషయం తెలుసుకున్న పోలీసులు చిన్నారుల సమాచారాన్ని మండలంలోని పలు ప్రాంతాల్లో విచారించారు. తన ఇద్దరు సంతానం చినగంజాం రైల్వే స్టేషన్ వద్ద ఉన్నారని సమాచారం అందుకున్న తల్లి చిన్నారి బుధవారం తెల్లవారు జామున వారి దగ్గరకు వచ్చి అక్కున చేర్చుకుంది.

**తల్లీబిడ్డలకు సాయమందించిన సర్పంచ్**

సంఘటన కొత్తపాలెం పంచాయతీ పరిధిలో చోటు చేసుకోవడంతో గ్రామ సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి వెంటనే స్పందించారు. తల్లీబిడ్డలను కలుసుకొని పూర్తిగా విషయాన్ని చిన్నారుల తల్లి చిన్నారి నుంచి తెలుసుకొని వారికి భోజనపు ఖర్చులు నిమిత్తం నగదు సాయమందించడమే కాకుండా అధికారులు దృష్టికి విషయం తీసుకొని వెళ్లి మిగిలిన సంతానాన్ని కూడా ఆమె చెంతకు చేర్చి వారందరికీ న్యాయం జరిగేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీనిపై సమాచారం అందుకున్న జిల్లా చైల్డ్‌లైన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పురుషోత్తం మాట్లాడుతూ ఈ ఘటనపై బాధితులతో మాట్లాడి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, చిన్నారులను వదిలిపెట్టి వెళ్లిన తండ్రి ఆచూకీ తెలుసుకుని తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

## అరకు కాఫీ తోటల పరిశీలన

**పంటలో నష్టం కలిగిస్తున్న బెర్రీ బోరర్ పురుగు వ్యాప్తి స్థితిపై అంచనా**



కాఫీ తోటల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల పరిశోధక బృందం

**బాపట్ల:** కాఫీ పంటకు అత్యంత హానికరమైన కాఫీ బెర్రీ బోరర్ పురుగు వ్యాప్తి స్థితిని అంచనా వేయడానికి బాపట్ల వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కూడిన బృందం అరకులో పరిశోధన చేస్తున్నట్లు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూన రాణి తెలిపారు. కీటక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఆర్.కోటేశ్వరరావు, కీటక శాస్త్ర ఆచార్యులు డా. టి.మధుమతి, పేథాలజీ విభాగ ఆచార్యులు డా.జి.వంశీకృష్ణ, ఉద్యానవన విభాగ ఆచార్యులు డా.సిహెచ్. దుర్గా హేమంత్ కుమార్ మార్గదర్శకత్వంలో 25 మంది ఎమ్మెస్సీ వ్యవసాయ విద్యార్థులతో ఈ బృందం సర్వే చేస్తున్నట్లు ఆమె వివరించారు. ఆఫ్రికాకు చెందిన ఈ చిన్న బీటిల్ పురుగు కాఫీకి అత్యంత హానికరమైనదని, ఇది కాఫీ ఉత్పత్తుల నాణ్యతలను, దిగుబడిని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని, అంతేకాకుండా ప్రపంచ వ్యాప్తంగా 500 మిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక నష్టాన్ని కలగజేస్తుందని డా.ఎస్.ఆర్.కోటేశ్వరరావు తెలిపారు. కాఫీ గింజలో తన జీవిత చక్రాన్ని పూర్తి చేయగల ఏకైక కీటకమని, ఇది ప్రపంచంలో కాఫీని ఉత్పత్తి చేసే అనేక దేశాలను ఆక్రమించిందని, రైతులకు దీని నివారణకు తగిన శిక్షణ లేకపోవడం పొలాల పేలవమైన నిర్వహణ ఈ తెగులు వ్యాప్తికి కారణమన్నారు.

- తమ బృందం గత రెండు రోజులుగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని బోడగూడ, చొంపగూడ, గోడగూడ, నందిగూడ, దొరగూడ, పప్పుడువలస, గాయబంద, మోరిగూడ ప్రాంతాలలోని కాఫీ తోటలలో సర్వే నిర్వహించి కీటకం ద్వారా రైతులకు సంభవించే నష్టాలను గుర్తించి తగు చర్యలను సూచించినట్లు తెలిపారు. వీరి పరిశోధనకు చొంపి గ్రామ వ్యవసాయ సహాయకుడు వి.రాజమణి కుమార్ సహకరించినట్లు ఆయన తెలిపారు.

### తురకపాలెంలో ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్



**గుంటూరు రూరల్:** తురకపాలెం గ్రామంలో అనధికారికంగా వైద్య సేవలు అందిస్తున్న ఒక ఆర్‌ఎంపీ క్లినిక్‌ను జిల్లా వైద్య అధికారి డాక్టర్ కె. విజయలక్ష్మి బుధవారం సీజ్ చేశారు. ఆర్‌ఎంపీ వైద్యుడు సెలైన్‌లు, అధిక మోతాదులోని యాంటీబయాటిక్స్ రోగులకు అందిస్తున్నట్లు రుజువు కావటంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్సకు మాత్రమే అర్హులని గుర్తుచేశారు. దానికి మించి చికిత్సలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

## రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

**జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి**



హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

**బాపట్ల:** రెడ్ క్రాస్ సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. రెడ్ క్రాస్ సంస్థ వార్షిక సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జరిగింది. బాపట్ల జిల్లాగా ఏర్పడిన నాటి నుంచి జిల్లాలో చేపట్టిన సేవా కార్యక్రమాలపై సంస్థ జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణ భట్టు స్పష్టమైన నివేదికలను సమర్పించారు. కమిటీ ఆమోదించిన తదుపరి రెడ్ క్రాస్ సంస్థ ద్వారా విశేష సేవలు అందించిన 18 మంది సభ్యులకు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు, జ్ఞాపకాలను అందించారు. నూతన పాలక మండలి ఎన్నికలు జరగ్గా, 11 మంది పాలకవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. చైర్మన్‌గా బి.ఎస్.నారాయణ భట్టు మరోసారి ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా బి.రామ సుబ్బారావు, కోశాధికారిగా టి.ప్రసాదరెడ్డి ఎన్నిక కాగా మరో తొమ్మిది మంది సభ్యులుగా ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు. నూతన పాలకవర్గం సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. మంచి సేవలు అందిస్తున్న సంస్థ ప్రతినిధులను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అభినందించారు. రెడ్ క్రాస్ సంస్థ రాష్ట్ర కోశాధికారి పి.రామచంద్రారాజు, సంస్థ చైర్మన్ బి.ఎస్.నారాయణ భట్టు మాట్లాడారు. కలెక్టరేట్ ఏఓ మల్లికార్జునరావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యం

## నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,800 గరిష్ఠం : రూ. 2,700

మోడల్ ధర రూ. 2,300

## పసుపు ధరలు (బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 145

| కొమ్ములు : 117 బస్తాలు (ధర రూ॥ల్లో) | | |
|---|---|---|
| కనిష్ఠ : | గరిష్ఠ : | మోడల్ : |
| 10,100 | 10,400 | 10,400 |

| కాయలు : 28 బస్తాలు | | |
|---|---|---|
| కనిష్ఠ : | గరిష్ఠ : | మోడల్ : |
| 10,100 | 10,400 | 10,400 |

మొత్తం అమ్మకాలు : 108.75 క్వింటాళ్లు

-దుగ్గిరాల

## మిర్చి యార్డు సమాచారం (బుధవారం ధరలు)

| | |
|---|---|
| వచ్చిన బస్తాలు | 44,120 |
| అమ్మకాలు | 46,874 |
| నిల్వ | 15,094 |

| నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.) | |
|---|---|
| 334 | 10,000-14,400 |
| నంబరు-5 | 10,000-13,500 |
| 273 | 10,500-13,700 |
| 341 | 10,000-15,200 |
| 4884 | 10,000- 14000 |

| ఏసీ కామన్ రకం క్వింటా (రూ.) | |
|---|---|
| 334 | 10,500-14,500 |
| నంబరు-5 | 10,000-13,600 |
| 341 | 11,000-15,600 |
| 4884 | 10,000-14,200 |

| నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.) | |
|---|---|
| తేజ | 10,000 - 15,300 |
| బాడిగ 355 | 10,000 - 15,800 |
| దేవనూరు డీలక్స్ | 10,000 - 14,000 |
| ఆర్మూర్ | 9,800 - 12,500 |
| తాలుకాయలు | 6,200 - 8,000 |

| ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.) | |
|---|---|
| తేజ | 10,000 - 15,200 |
| బాడిగ 355 | 10,000 - 15,500 |
| దువనూర్ డీలక్స్ | 10,500 - 14,500 |
| తాలు | 5,500 - 7,500 |

-కొరిటిపాడు (గుంటూరు)

క్లుప్తంగా

### నేటి నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సేవలు నిలుపుదల

**శావల్యాపురం:** ఏపీ గ్రామీణ బ్యాంక్ ఆన్‌లైన్ సేవలను 11 నుంచి 15 వరకు ఆర్‌బీఐ నిబంధనలు మేరకు నిలుపుదల చేయనున్నట్లు బ్రాంచ్ మేనేజరు వలేటి శివకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సాఫ్ట్‌వేర్ పనులు చేస్తున్న నేపథ్యంలో నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# పేద విద్యార్థులకు వరం

- నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ నోటిఫికేషన్ విడుదల
- ఏటా రూ. 12వేల చొప్పున ఉపకార వేతనం



**యద్దనపూడి:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్ర మానవ వనరులశాఖ ఏటా జాతీయ ఉపకార వేతన పరీక్ష నిర్వహిస్తోంది. ప్రతిభ ఉన్న వారికి పేదరికం అడ్డుకా రాదని చెబుతూ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు నాలుగేళ్ల పాటు ఏటా రూ. 12వేల చొప్పున ఉపకార వేతనం అందిస్తోంది. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఈనెల 30వ తేదీ కాగా, ఈ ఏడాది డిసెంబర్ 7న పరీక్ష జరగనుంది. దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**అర్హులు వీరే...**

ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, వసతి లేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3.5 లక్షల లోపు ఉండాలి. 2024-25 విద్యా సంవత్సరంలో 7వ తరగతిలో బీసీ, ఓసీ విద్యార్థులు 55శాతం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50శాతం మార్కులు సాధించి ఉండాలి.

**దరఖాస్తు ఇలా చేయాలి**

ఆసక్తి ఉన్న విద్యార్థులు www. bse. ap. gov. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీనికి ఎటువంటి ధ్రువపత్రాలు అవసరం లేదు. ఓసీ, బీసీ విద్యార్థులకు పరీక్ష రుసుం రూ.100 కాగా, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ. 50 చొప్పున ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమయంలో లభించే ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా చెల్లించాలి. దరఖాస్తులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు ఆధార్ కార్డులో ఉన్న విధంగానే నమోదు చేయాలి.

**ఉపకార వేతనం**

ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతిలో 55శాతం మార్కులు, 10వ తరగతిలో 60శాతం, ఇంటర్ మొదటి సంవత్సరంలో 55శాతం మార్కులు సాధిస్తేనే ఉపకార వేతనం కొనసాగుతుంది. ఈ పథకం కింద ప్రతి సంవత్సరం రూ. 12వేల చొప్పున నాలుగు సంవత్సరాలకు విద్యార్థికి ఉపకార వేతనం లభిస్తుంది.

# ప్రాణాపాయంలో చిన్నారి

- బ్రెయిన్ ఫీవర్‌తో మృత్యువుతో పోరాటం
- ఆర్థిక స్థోమత లేక నిస్సహాయ స్థితిలో కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు
- కొంతమేర సాయం చేసిన గ్రామస్తులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు
- పూర్తిగా కోలుకునేందుకు మరికొన్ని రోజులు వైద్యం చేయాలంటున్న డాక్టర్లు
- దాతల సాయానికై ఎదురు చూపులు



బ్రెయిన్ ఫీవర్‌తో ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న బాలుడు సాత్విక్

**పర్చూరు(చినగంజాం):** బ్రెయిన్ ఫీవర్ సోకడంతో ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడుతున్నాడో చిన్నారి. కొద్దిరోజులుగా చికిత్స అందిస్తున్నప్పటికీ స్పృహలోకి రాకపోవడంతో మరికొన్ని రోజులు చికిత్స తప్పదంటున్నారు వైద్యులు. వివరాల్లోకి వెళితే.. పర్చూరు మండలంలోని చెన్నుంబొట్ల అగ్రహారానికి చెందిన పేర్లి సాత్విక్, సోదరి సంజనలు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. వారి తండ్రి పేర్లి సురేష్ వ్యవసాయ కూలీగా పనిచేస్తుంటాడు. రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేద కుటుంబం వారిది. ఈక్రమంలో సెప్టెంబర్ 5న సాత్విక్‌కు తీవ్రమైన జ్వరం సోకి ఫిట్స్ రావడంతో చిలకలూరిపేటలోని వైద్యశాలలో చేర్పించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తీసుకెళ్లాలని సూచించారు.

**రోజుకు రూ.25వేలు విలువైన ఇంజక్షన్**

గుంటూరులోని ఓ ప్రైవేటు పిల్లల హాస్పిటల్‌లో చేర్పించగా, పరీక్షించిన వైద్యులు బాలుడికి బ్రెయిన్ ఫీవర్ సోకిందని తెలిపారు. రోజుకు రూ. 25 వేలు విలువైన ఇంజక్షన్ చేస్తే నయం చేయవచ్చని వైద్యులు సలహా ఇచ్చారు. పేద కుటుంబం కావడంతో దిక్కుతోచని బాలుని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**ప్రాణాలు నిలపాలని వేడుకోలు**

సాత్విక్ వైద్య ఖర్చుల కోసం అవసరమైన ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్న విషయం పలువురు తెలుసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయుడు గనిపిశెట్టి గోవిందరావు తమ విద్యార్థి సాత్విక్ పరిస్థితిని తెలుసుకొని గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలోని ఉపాధ్యాయ గ్రూపులను, ఉద్యోగులను, గ్రామస్తులను సంప్రదించి వారిని చైతన్యపరచి రూ. 1.91 లక్షలు నగదు వసూలు చేసి బాలుడి వైద్యఖర్చుల నిమిత్తం అందజేశారు. బాలుడు కోలుకునేందుకు ఇంకా నగదు అవసరం కావడంతో బాలుడి తల్లిదండ్రులు దాతలసాయం కోసం ఎదురు చూస్తున్నారు. సాయం అందించేందుకు దాతలు పాఠశాల ఉపాధ్యాయుడు గనిపిశెట్టి గోవిందరావును సంప్రదించాలని కోరుతున్నారు.

## విద్యాశాఖ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

- ఏఐఎస్ఎఫ్ డిమాండ్
- ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా





ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

**నరసరావుపేట ఈస్ట్:** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖలో పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్లు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ పెద్దలు ఎన్నికల సమయంలో విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, కళాశాలల బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోని వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ బకాయిలు పేరుకపోతున్నాయే తప్పా నిధులు విడుదల కావడం లేదని తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ఫీజు బకాయిల పేరుతో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయడంతో పాటు విద్యార్థుల సర్టిఫికెట్లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు జగదీష్, మధు, హేమంత్, ఆర్.అంజిరెడ్డి, యు.రాజు పాల్గొన్నారు. తొలుత అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా తరలివచ్చారు.

## బెట్టింగ్‌లో నష్టపోయి యువకుడి ఆత్మహత్య

**రైలు కిందపడి మృతి**

**నరసరావుపేట టౌన్:** క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకొని ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఘటనకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతూరుకు చెందిన సీతారామ్(25) మెడికల్ హోల్‌సేల్ దూకాణంలో పని చేస్తుంటాడు. క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు నష్టపోయాడు. అధిక వడ్డీలకు తెచ్చి మరీ పందేలు కాశాడు. గత కొన్ని నెలలుగా అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతో సోమవారం అర్ధరాత్రి జొన్నలగడ్డ గ్రామ సమీపంలోని టిడ్కో గృహ సముదాయం వెనుక ప్రాంతంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముందు విషయాన్ని స్నేహితునికి ఫోన్‌లో చెప్పాడు. అర్ధరాత్రి సీతారామ్ ఆచూకీ కోసం బంధువులు, స్నేహితులు పరిసరాలు అంతా వెతికారు. మంగళవారం ఉదయం రైలు పట్టాలపై మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. శవ పంచనామా అనంతరం బంధువులకు అప్పగించారు.

## 12న అండర్-14, 17 క్రీడా పోటీలు

**యద్దనపూడి:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 12వ తేదీ శుక్రవారం మండలంలోని అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-14,17 బాలబాలికలకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం ఎం.రాఘవరెడ్డి , మండల కో-ఆర్డినేటర్ ఇ.కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఖోఖో, కబడ్డీ, యోగా, అథ్లెటిక్స్, చెస్, షటిల్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ, బోనఫైడ్ పత్రాలను తీసుకొని రావాలన్నారు.

## పేదల కోసం పోరాడిన వీరనారి ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంబటి రాంబాబు, పార్టీ శ్రేణులు

**నగరంపాలెం:** భూమి, భుక్తితోపాటు వెట్టి నుంచి విముక్తి కోసం పోరాడిన వీరనారి చిట్యాల ఐలమ్మ అని మాజీ మంత్రి, వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ మహిళలపై చిన్నచూపు కనబరిచే ప్రతి ఒక్కరికి ఆమె పోరాటం కనువిప్పు కలిగించిందని పేర్కొన్నారు. పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిందన్నారు. పేదల విముక్తి కోసం పోరాడిన వీరనారి అని అన్నారు. అదే విధంగా భూమి కోసం సాహించిన తొలి మహిళని చెప్పారు. కార్యక్రమంలో అరవింద్, వసంత్, పోకల వెంకటేశ్వర్లు, కొల్లూరు శివప్రసాద్, సుబ్బు, దుర్గాదేవి, బద్రి, గౌరీశంకర్, కిషోర్, శంకర్ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో కాంట్రాక్టు కూలీ మృతి

**మాచర్ల రూరల్:** విద్యుత్ లైన్ల పనులు చేస్తూ షాక్‌కు గురై స్తంభం పైనుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జమ్మలమడకలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వెల్దుర్తి మండలం, గొట్టిపాళ్ల గ్రామానికి చెందిన ముప్పరపు సురేష్ (27) విద్యుత్ లైన్ల పనుల కోసం కాంట్రాక్టర్ రెడ్యానాయక్ తరపున జమ్మలమడక గ్రామానికి కూలీకి వచ్చాడు. ఈ సమయంలో స్తంభం పైకి ఎక్కి పని చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కింద పడి మృతి చెందాడు. సురేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు.

## జీవన నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ ప్రసాద్

**విజయపురి సౌత్:** స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలపై రెండు రోజుల పాటు విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. దీనిలో భాగంగా ఏపీఎస్‌సీఈఆర్‌టీ కరికులం కమిటీ మెంబర్ డాక్టర్ సీపీ ప్రసాద్ మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే పరిస్థితుల్లో స్థిరంగా ఉండాలని తెలిపారు. కళాశాలలోని గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాహిత్యాభిలాషులుగా ఉంటూ సమాజ హితానికి పాటుపడాలని చెప్పారు. స్ఫూర్తివంతమైన కథలతో విద్యార్థులకు సూచనలు అందించారు. రెండవ రోజు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు కె. ప్రభాకర్ మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలైన సమానత్వం, సౌభ్రాతృత్వం కలిగి ఉండాలని ఉన్నత విద్యావంతులుగా తయారవ్వాలని తెలిపారు. చదువొక్కటే జీవితాలను మార్చగలదని చెప్పారు. తెలంగాణ జన విజ్ఞాన వేదిక స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కె. కొండల రెడ్డి విద్యార్థులకు ప్రత్యక్షంగా కొన్ని ప్రయోగాలను చూపించి సైన్స్‌పై అవగాహన కల్పించారు. కాళోజీ కవితను వినిపించి, ఆయన సాహిత్యాన్ని చదవాలని విద్యార్థులకు కిరణ్మయి సూచించారు. అందరితో రాజ్యాంగ పీఠికను పాండురంగారావు (మట్టి ప్రచురణలు) చదివించారు. కార్యక్రమం ప్రిన్సిపాల్ నయీం భాను పర్యవేక్షణలో జరిగింది. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు..

## ఏపీఆర్ఎస్ఏ క్రీడా పోస్టర్ ఆవిష్కరణ



ఉద్యోగ సంఘ నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ అశుతోష్ శ్రీవాత్సవ

**గుంటూరు వెస్ట్:** ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర స్థాయి క్రీడా పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ బుధవారం ఉద్యోగ సంఘ నాయకులతో కలిసి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ నవంబర్ 7, 8, 9వ తేదీల్లో అనంతపురంలో రెవెన్యూ స్పోర్ట్స్ మీట్-2025లో జరుగుతుందన్నారు. దీనిలో జిల్లా నుంచి 55 మంది పాల్గొంటారని తెలిపారు. జేసీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, ప్రధాన కార్యదర్శి వెంకటరావు, రాష్ట్ర కార్యదర్శి దివ్య, షేక్ దరియా వలి ఈఖీ, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. అనుపమ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆయూబ్, ట్రెజరర్ నాగేశ్వరరావు, కార్యదర్శి రామారావు, బాబురావు, లీల, సంధ్యారాణి, త్రిలోక తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో ఎస్సీలకు రక్షణ కరవు

- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నేతల ధ్వజం
- 16న నరసరావుపేటలో విస్తృత స్థాయి సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎస్సీ సెల్ నాయకులు

**నరసరావుపేట:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి ఎస్సీలపై దాడులు, వారి మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నేతల ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నబాల శామ్యూల్, పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్ము చంద్రశేఖరరావు మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నరసరావుపేటలో ఈనెల 16న ఎస్సీ సెల్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు టీజేఆర్ సుధాకర్‌బాబు, వర్కింగ్ అధ్యక్షులు కొమ్మూరి కనకారావు, జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. ఎస్సీలు అంటే షెడ్యూలు క్యాస్ట్ కాదని, వైఎస్సార్ సీపీకి స్టాండర్డ్ కాస్ట్ అని గత ఎన్నికల్లో అత్యధికంగా ఓట్లేసి నిరూపించారని తెలిపారు. పార్టీకి వచ్చిన ఓట్లలో ఎస్సీలవే అధికంగా ఉన్నాయని అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా చెప్పారని వారు పేర్కొన్నారు. పార్టీకి కంచుకోటలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను తన వారిగా చెప్పుకొని వారికి జగన్‌మోహన్‌రెడ్డి సాధ్యమైనంత మేలు చేశారని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నాయకులు ఆయా వర్గాలపై దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు వైఎస్సార్ సీపీకి దూరం చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. ఎన్ని కుయుక్తులు పన్నినా తమ వర్గాలను వైఎస్సార్ సీపీ నుంచి విడదీయలేరని వారు స్పష్టం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలోని దళితులంతా పార్టీకి వెనుదన్నుగా ఉండాలని వారు కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు చావలి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పులివెల మాణిక్యం, జిల్లా కార్యదర్శులు కాలే మాణిక్యాలరావు, నెలటూరి సురేష్, ఎస్సీ సెల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కందుల ఎజ్రా, అచ్చంపేట, యడ్లపాడు, రొంపిచర్ల మండలాల ఎస్సీ సెల్ అధ్యక్షులు శిఖా తిమోతి, వలేటి ఉదయకిరణ్, గుండాల వెంకటేష్ పాల్గొన్నారు.

### సంతకం ఫోర్జరీపై ముగిసిన విచారణ

**గుంటూరు మెడికల్:** గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ సంతకాన్ని ఫోర్జరీ చేశారనే ఫిర్యాదులు రావడంతో ఆసుపత్రిలో నలుగురు వైద్యులతో కూడిన ప్రత్యేక కమిటీ ఐదు రోజులుగా విచారణ చేపట్టింది. ఇటీవల డీఎస్సీ టీచర్ ఉద్యోగాలకు దివ్యాంగుల కోటాలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గుంటూరు జీజీహెచ్‌లో జరుగుతోంది. బుధవారం జిల్లా కలెక్టర్‌కు షీల్డ్ కవర్‌లో నివేదిక అందజేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ తెలిపారు.

## పిడుగుపాటుతో తాటి చెట్లు దగ్ధం



పల్లెపాలెంలో తాటి తోపులో పిడుగు ధాటికి ఎగిసిన మంటలు

**చినగంజాం:** మండలంలోని పల్లెపాలెం పంచాయతీ తూర్పుపల్లెపాలెం గ్రామంలో తాటి తోపులో పిడుగు పడి తాటి చెట్లు దగ్ధమయ్యాయి. బుధవారం సాయంత్రం మండలంలో భారీగా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. అకస్మాత్తుగా వచ్చిన తెల్లని కాంతితో మెరుపులు, ఉరుములు భారీ శబ్దాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. పల్లెపాలెం పంచాయతీలోని తూర్పు పల్లెపాలేనికి ఉత్తరం వైపు ఉన్న తాటి తోపులో తాటి చెట్లమీద ఒక్కసారిగా పిడుగు పడటంతో సుమారు 10 చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. భారీగా మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. గృహాలకు ఎటువంటి నష్టం జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి

**చిలకలూరిపేట టౌన్:** ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి గల్లంతైన వ్యక్తి ఆచూకీని బుధవారం అధికారులు కనుగొన్నారు. మండలంలోని మురికిపూడికి చెందిన కొమ్మనబోయిన అంకమ్మబాబు (40) మంగళవారం నీటి కుంటలో దిగి గల్లంతైన విషయం తెలిసిందే. ప్రతాపరెడ్డి గ్రానైట్ క్వారీ వద్ద ఉన్న కుంటలో కాళ్లు కడుక్కుంటున్న సమయంలో అదుపు తప్పి జారిపడ్డాడు. ఈత రాకపోవడంతో అక్కడికక్కడే మునిగిపోయి మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. కుంటలోతు, నీరు అధికంగా ఉన్నందున ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ఘటన సమాచారం అందిన వెంటనే అంకమ్మబాబు మృతదేహం కోసం క్వారీ కుంటలో ఆదేరోజు గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ లభించకపోవడంతో బుధవారం ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుంది. విస్తృతంగా గాలించి ఉదయం 11 గంటలకు మృతదేహాన్ని వెలికి తీశారు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ దుర్ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## మైనర్‌తో అసభ్యంగా వ్యవహరించిన వ్యక్తిపై కేసు

**అమరావతి:** మండల కేంద్రమైన అమరావతికి చెందిన బాలికపై అభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై అమరావతి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం స్థానిక క్రోసూరు రోడ్డులో పాల బూత్ వద్దకు మైనర్ బాలిక వచ్చింది. నిర్వాహకుడు వి. ప్రవీణ్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పింది. ఈ మేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ అచ్చియ్య ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.